AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
30-10-2025 (Thursday) MAIN EDITION

## స్టార్‌లింక్ డెమో రన్ షురూ..





**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** భారతదేశంలో టెలికాం సేవలు ప్రారంభించాలని యోచిస్తున్న ఎలన్ మస్క్ సంస్థ స్టార్ లింక్ ట్రయల్ రన్ నిర్వహించేందుకు సిద్ధమైంది. అక్టోబర్ 30, 31 తేదీల్లో ముంబైలో డెమోరన్‌లను నిర్వహిస్తోంది. భారతదేశంలో ఉపగ్రహ బ్రాడ్‌బ్యాండ్ సేవలకు అవసరమైన భద్రత, సాంకేతిక పరిస్థితులకు అనుగుణంగా ఉన్నట్లు పరిశీలించడానికి ఈ ట్రయల్ రన్ నిర్వహిస్తోంది. స్టార్‌లింక్‌కు కేటాయించిన తాత్కాలిక స్పెక్ట్రమ్ ఆధారంగా చట్ట అమలు సంస్థల ముందు ఈ డెమో నిర్వహించబడుతుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## వాట్సాప్ నుంచి మరో అప్‌డేట్..



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** యూజర్ల అనుభవాన్ని మెరుగుపరిచే విలువైన అధునాతన ఫీచర్లను వాట్సాప్ నిరంతరం పరిచయం చేస్తోంది. యూజర్ల కోసం ఎప్పటికప్పుడు తన సేవలను విస్తృతం చేస్తున్న వాట్సాప్ మరో అప్‌డేట్‌తో ముందుకొస్తోంది. ఈ ప్లాట్‌ఫామ్ ఇప్పుడు ఫేస్‌బుక్ లాంటి ఫీచర్‌ను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తోంది. ఇది కస్టమర్లు తమ ప్రొఫైల్‌కు కవర్ ఫొటోను పెట్టేందుకు వీలు కల్పిస్తుంది.

## అమెరికా ఆంక్షల నుంచి ఊరట




**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ఇరాన్‌లోని చాబహార్ పోర్టు విషయంలో భారత్‌కు ఊరట లభించింది. వచ్చే ఏడాది ప్రారంభం వరకు అమెరికా ఆంక్షల నుంచి మినహాయింపు దొరికింది. అమెరికా గతంలో ఇచ్చిన మినహాయింపు గడువు నేడు ముగియగా పొడిగించింది. దీంతో చాబహార్ పోర్టులోని షహీద్ బెహెస్తీ టెర్మినల్ అభివృద్ధి, నిర్వహణకు భారత్‌కు వీలు కలిగింది.

## పెన్నా నదిలో పడవల వెలికితీత



**అక్షరటుడే, అమరావతి:** నెల్లూరు జిల్లాలో పెన్నా నదిలో ఇరుక్కున్న బోట్లను ఎట్టకేలకు వెలికితీశారు. పెన్నా నదిలో ఇసుక తవ్వకాల కోసం తెప్పించి రెండు రోజుల క్రితం తాడుతో బోట్లను కట్టేశారు. వర్షాలకు మూడు బోట్లు కొట్టుకుపోయాయి. బుధవారం రెండు పడవలను గట్టుకు తరలించిన అధికారులు.. నేడు 35 టన్నుల బరువున్న భారీ బోటును బయటకు తీశారు.

## 4 నుంచి గ్రో ఐపీవో..




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ప్రముఖ స్టాక్ బ్రోకరేజీ సంస్థ గ్రో మాతృ సంస్థ బిలియన్ బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్ ఐపీవో నవంబర్ 4 నుంచి ప్రారంభం కానుంది. నవంబర్ 7న ముగియనుంది. మొత్తం రూ.6,632 కోట్లు సమీకరించేందుకు పబ్లిక్ ఇష్యూకు వస్తున్న ఈ సంస్థ ధరల శ్రేణిని రూ.95-100గా నిర్ణయించింది.

## ట్రంప్, జిన్‌పింగ్ భేటీ..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా, చైనా మధ్య తీవ్ర స్థాయిలో వాణిజ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఆ రెండు దేశాల అధ్యక్షులు సమావేశమయ్యారు. దక్షిణ కొరియాలోని బుసాన్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా చీఫ్ జి జిన్‌పింగ్ భేటీ అయ్యారు. దాదాపు రెండు గంటల పాటు సాగిన ఈ భేటీలో కీలక అంశాలపై చర్చించారు. ఈ భేటీ నేపథ్యంలో చైనాకు ఊరట కల్పిస్తూ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. చైనా వస్తువులపై సుంకాలను 57 శాతం నుంచి 47 శాతానికి తగ్గిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ప్రకటించారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో అద్భుతమైన సమావేశం జరిగిందని పేర్కొన్నారు. చర్చల తర్వాత చాలా నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు.

## కొట్టుకుపోయిన శ్రీశైలం, హైదరాబాద్ హైవే..



**అక్షరటుడే, హైదరాబాద్:** మొంథా తుపాన్ తెలుగు రాష్ట్రాల్లో బీభత్సం సృష్టించింది. దీని ప్రభావంతో బుధవారం తెలంగాణలోని పలు జిల్లాల్లో కుండపోత వాన కురిసింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో భారీ వర్షంతో డిండి నదికి వరద పోటెత్తింది. వరద ధాటికి హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారి తీవ్రంగా దెబ్బతింది. నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని లత్తీపూర్ సమీపంలో రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో హైదరాబాద్ - శ్రీశైలం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.



# ముంచెత్తిన మొంథా

**జలదిగ్బంధంలో వరంగల్, హన్మకొండ, కాజీపేట**

**వరద ప్రాంతాల్లో మంత్రి కొండా సురేఖ పర్యటన**

**సహాయక చర్యలపై సీఎం రేవంత్ ఆరా**

మొంథా తుపాన్ తెలంగాణపై తీవ్ర ప్రభావం చూపించింది. వివిధ జిల్లాలో బారీ వర్షా లు కురిశాయి. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా అతలాకుతలం అయింది. ముఖ్యంగా వరంగల్ నగరంలో వరదలు ముంచెత్తాయి. బుధవారం రాత్రి వరకు వర్షం తగ్గినా.. నగరాన్ని వరద వీడటం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరంగల్, హన్మకొండ, కాజీపేట ప్రాంతాలు నీట మునిగాయి. హంటర్ రోడ్డులో బొంది వాగు తీవ్ర ఉధృతితో ప్రవహిస్తోంది. ప్రధాన రహదారులు చెరువులను తలపిస్తుండగా.. 45 కాలనీలు నీట మునిగాయి.

– అక్షరటుడే, హైదరాబాద్

వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నారు. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. భద్రకాళి ఆలయం నుంచి పాలిటెక్నిక్ కాలేజీ దాకా రోడ్డుపై నీరు నిలిచిపోయింది. దీంతో ఆలయం వైపు మార్గాన్ని మూసేశారు. సమ్మయ్య నగర్‌ను వరద చుట్టు ముట్టడంతో 4 వేల మంది చిక్కుకుపోయారు. ఇళ్లపైకి ఎక్కి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. పలు కాలనీల్లో కార్లు, బైక్‌లు వరదలో కొట్టుకుపోయాయి. ముంపు ప్రాంతాల ప్రజల కోసం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు.

### వరద ప్రాంతాలకు మంత్రి సురేఖ

మంత్రి కొండా సురేఖ పలు కాలనీలలో పర్యటించారు. వరదల్లో చాలా మంది చిక్కుకుపోయారని ఆమె చెప్పారు. పలువురు ఇళ్లను వదలి రావడానికి నిరాకరిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. అధికారులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నాయని వివరించారు. పాఠశాలలు, ఫంక్షన్ హాళ్లలో తాత్కాలిక ఆశ్రయాలను ఏర్పాటు చేశామన్నారు. ఆహార పంపిణీ కోసం పడవలు, డ్రోన్‌లతో సహా రెస్క్యూ బృందాలను ప్రభావిత ప్రాంతాలకు మోహరిస్తున్నట్లు తెలిపారు.

### హన్మకొండకు సీఎం

హన్మకొండలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు చేపట్టాలని ఇప్పటికే ఆయన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలపై ముఖ్యమంత్రి ఆరా తీశారు.

### పంటలకు తీవ్ర నష్టం

మొంథా తుపాన్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కొనుగోలు కేంద్రాలు, రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. పలు చోట్ల ధాన్యం, మక్కలు కొట్టుకుపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొట్టుకుపోవడంతో మహిళ రోదించింది. పరిశీలనకు వచ్చిన కలెక్టర్ కాళ్లపై పడి తమను ఆదుకోవాలని వేడుకుంది.

## బీఆర్ఎస్ మౌత్‌పీస్‌గా కిషన్‌రెడ్డి..



**అక్షరటుడే, హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ దూసుకుపోతోంది. మంత్రులు నియోజకవర్గంలోని డివిజన్లలో పర్యటిస్తున్నారు. తమ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని ప్రజలను కోరుతున్నారు. యూసుఫ్‌గూడ డివిజన్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం ఉదయం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల కోసం కిషన్ రెడ్డి, కేసీఆర్ కలిసి డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. 12 ఏళ్లుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి కేంద్రం నుంచి ఏం తెచ్చారో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పాలని ప్రశ్నించారు. ఆయన పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉన్న జూబ్లీహిల్స్ అభివృద్ధిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ గత పదేళ్లలో జూబ్లీహిల్స్ కి ఏం చేసిందో చెప్పాలన్నారు. కిషన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ మౌత్‌పీస్‌గా మారారని పొన్నం ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు తాను అనడం లేదని, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అంటున్నారని చెప్పారు. మొత్తంగా బీజేపీని తీసుకుపోయి బీఆర్ఎస్‌కు అప్పగించారని విమర్శించారు. కాంగ్రెస్‌పై గెలవలేక బీఆర్ఎస్, బీజేపీ కలిసి కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు.

## జూబ్లీహిల్స్‌లో సభలు, ర్యాలీలు పెట్టం: కిషన్ రెడ్డి



**అక్షరటుడే, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఎన్నికల్లో భాగంగా పార్టీ తరపున పెద్ద పెద్ద సభలు, ర్యాలీలు నిర్వహించబోమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. పార్టీ అభ్యర్థికి మద్దతుగా గురువారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీ ర్యాలీలు, సభలు పెట్టకుండా.. ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి ప్రచారం చేస్తామని తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ఈ సమస్యలకు బీఆర్ఎస్, కాంగ్రెస్ కారణమని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి మజ్లిస్ ఆదేశాలతో నడుస్తున్నారని విమర్శించారు. ఒక వర్గం ఓట్ల కోసం అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తున్నారన్నారు. కాంగ్రెస్‌కు మెజారిటీ ప్రజల ఓట్లు అవసరం లేదా అని ప్రశ్నించారు. మజ్లిస్ పార్టీ మద్దతు ఉంటే సరిపోతుందా అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కుట్రలను జూబ్లీహిల్స్ ప్రజలు అర్థం చేసుకోవాలని కేంద్ర మంత్రి కోరారు. ఇప్పటి వరకు జూబ్లీహిల్స్‌లో బీజేపీ గెలవలేదన్నారు. ఒకసారి తమకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో ఖచ్చితంగా బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తాము బీఆర్ఎస్, కాంగ్రెస్‌తో ఎప్పుడు కలవలేదన్నారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి పోటీ చేశాయని గుర్తు చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, మజ్లిస్ కుటుంబ పార్టీలని విమర్శించారు.

## అణ్వాయుధ పరీక్షలు ప్రారంభిస్తాం: ట్రంప్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. మళ్లీ అణ్వాయుధ పరీక్షలు ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ మేరకు అధికారులను ఆదేశించినట్లు ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. రష్యా, చైనా వంటి దేశాలు అణు సామర్థ్యాలను పెంచుకుంటున్న నేపథ్యంలో తాము కూడా అణు పరీక్షలు తిరిగి ప్రారంభించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ప్రపంచంలో ఇప్పటికే అత్యధిక అణ్వాయుధాలు అమెరికాకు ఉన్నాయి. తన హయాంలోనే ఇది సాధించినట్లు ట్రంప్ పేర్కొన్నారు. అయితే ఇటీవల రష్యా, చైనా ఆయుధ సంపత్తిని పెంచుకుంటున్నాయని చెప్పారు. ఆ దేశాలు త్వరలో అమెరికాతో సమానంగా అణ్వాయుధాలు సిద్ధం చేసుకునే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో తాము మరిన్ని ఆయుధాలు తయారు చేయాలని నిర్ణయించినట్లు ట్రంప్ తెలిపారు. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్‌కు ఆదేశాలు జారీ చేశానని ఆయన ప్రకటించారు.

## వర్క్ పర్మిట్ల ఆటో రెన్యువల్స్ రద్దు చేసిన అమెరికా

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా మరో సంచలన నిర్ణయం తీసుకుంది. వలస కార్మికుల వర్క్ పర్మిట్ల ఆటో రెన్యువల్ విధానాన్ని రద్దు చేసింది. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ ప్రకటన విడుదల చేసింది. అమెరికా అధ్యక్షుడిగా రెండో సారి బాధ్యతలు చేపట్టిన తర్వాత వలసదారులపై ట్రంప్ కఠిన చర్యలు చేపడుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే హెచ్-1బీ వీసా ఫీజు భారీగా పెంచిన ట్రంప్ తాజాగా.. ఉపాధి అధికార పత్రాల ఆటోమేటిక్ పొడిగింపును నిలిపివేశారు. వేలాది మంది విదేశీ ఉద్యోగులపై దీని ప్రభావం పడనుంది. అందులో ఎక్కువ మంది ప్రవాస భారతీయులు ఉంటారు.

## ఆర్జేడీ, కాంగ్రెస్‌పై మోదీ నిప్పులు..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి కాంగ్రెస్, ఆర్జేడీలపై నిప్పులు చెరిగారు. బీహార్‌లోని ముజఫర్‌పూర్‌లో గురువారం నిర్వహించిన బహిరంగ సభలో మోదీ రాష్ట్రీయ జనతాదళ్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఆ పార్టీ బీహార్‌ను "జంగిల్ రాజ్" యుగంలోకి తీసుకెళ్తుందని విమర్శించారు. ఆర్జేడీ పాలన "కట్ట (తుపాకి), క్రుర్త (క్రూరత్వం), కటుట (చేదు), కుషాసన్ (దుర్పరిపాలన) అవినీతి"తో నిండి ఉండేదని ప్రధాని గుర్తు చేశారు. ఇటువంటి రాజకీయాలను తిరస్కరించి, రాబోయే ఎన్నికల్లో అభివృద్ధి, స్థిరత్వానికి మద్దతు ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు.

## నాపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు.. రాజగోపాల్ రెడ్డి



**అక్షరటుడే, నల్గొండ:** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. తాను పార్టీ మారుతున్నట్లు కొందరు దృష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు సైతం కొందరు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు చెరువులను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాజకీయంగా తాను ఏదైనా నిర్ణయం తీసుకోవాలనుకున్నప్పుడు ప్రెస్ మీట్ పెట్టి చెబుతాను అంటూ క్లారిటీ ఇచ్చారు. తాను పార్టీ మారుతున్నట్లు వచ్చిన వార్తలను ఆయన ఖండించారు. మంత్రివర్గ విస్తరణ హైకమాండ్‌దే తుది నిర్ణయమని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా.. తాను కట్టుబడి ఉంటానని ప్రకటించారు.

## అందరూ నేను స్నానం చేయలేదని అనుకుంటారు!



బాలీవుడ్‌లో గ్లామర్ క్వీన్‌గా పేరొందిన అనన్య పాండే ఫిల్మీ బ్యాక్‌గ్రౌండ్ నుంచి వచ్చిన స్టార్ కిడ్. ఆమె తండ్రి చుంకీ పాండే బాలీవుడ్‌లో ప్రముఖ నటుడు. స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2 సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన అనన్య కెరీర్ మంచి దూకుడు మీదుంది. నేడు ఆమె తన 27వ పుట్టినరోజు జరుపుకుంటోంది. ఒక నెట్‌ఫ్లిక్స్ వీడియోలో అనన్య మాట్లాడుతూ.. "మా అమ్మ ప్రతిరోజూ నా చెవుల వెనుక రెండు నల్ల బొట్లు పెడుతుంది. అది నజర్ దోషం రాకుండా ఉండడానికి. కానీ అందరూ నేను స్నానం చేయలేదని అనుకుంటారు!" అని నవ్వుతూ చెప్పింది. ప్రస్తుతం అనన్య పాండే నటిస్తున్న 'తూ మేరీ మైన్ తేరా' సినిమా డిసెంబర్ 31న విడుదల కానుంది.

– అక్షరటుడే, సినిమా డెస్క్